# తుది నిర్ణయం మీదే



నరసింహులు

నా పేరు నరసింహులు. నా వయస్సు 50 సంవత్సరాలు. 50 ఏండ్లు అపమార్గాన జీవించిన నేను ముదిమికి చేరుకునే దశలో సత్యాన్ని గ్రహించాను. ఇస్లాం అంటే శాంతి, విధేయత, సమర్పణ అని తెలుసుకున్న నేను అన్ని విధాల నా జీవితాన్ని ఆ సర్వలోక ప్రభువు అయిన అల్లాహ్‌కు అంకితం చేశాను. ఇకమీదట నా జీవనం, నా మరణం, నా ప్రార్థన, నా త్యాగం అన్నీ సర్వోన్నతుడైన అల్లాహ్‌కే అర్పితం.

ఇస్లాం అదో విశ్వజనీన ధర్మం. అది మనిషిని దైవభీతిని, నైతిక రీతి ప్రబోధించి అతన్ని గొప్ప ధర్మపరాయణుడిగా తీర్చిదిద్దుతుంది. అతనిలో గొప్ప పరివర్తనను తీసుకువచ్చి అతని ఇహపరాల సాఫల్యానికి పూబాట వేస్తుంది. దానికనుగుణంగా నడుచుకునే వారికి అది నిజమైన గౌరవాన్ని ప్రసాదిస్తుంది. మానవులందరి ధర్మమైన ఇస్లాం ఒక్కటే, దైవగ్రంథమైన ఖుర్‌ఆన్ ఒక్కటే, అందరి ఆరాధ్య దైవం అల్లాహ్ ఒక్కడే. మానవులంతా ఒక్కటే.

**తల్లిదండ్రులు, బంధుమిత్రులు, పొరుగువారు, అతిథుల పట్ల సద్వ్యవహారం కలిగి ఉండండి. ఒకవేళ జనాలు మీకు ఏ విధమైనటువంటి ఇబ్బంది కలిగించినా మన్నింపుల వైఖరిని అవలంభించండి. అసభ్యంగా వ్యవహరిస్తే హుందాగా సలాం చేసి తప్పుకోండి. ఎట్టి స్థితిలోనూ ఎవ్వరితోనూ కయ్యానికి కాలు దువ్వకండి. సిగ్గుమాలిన పోకడల జోలికి వెళ్ళకండి. సారాయి, జూదం, వ్యభిచారం, పాచికల జోస్యం సమాజాన్ని భ్రష్టు పట్టించే, సంసారాన్ని నట్టేట ముంచే మహా భయంకర వ్యసనాలు. వీటికి దూరంగా మసలుకోండి. ఇదంతా ఎక్కడ నేర్చుకుని చెబుతున్నాడు? అంటారా–; ఇస్లాం ధర్మం నాకు నేర్పిన నైతిక విధానం ఇది. ఇది అన్నీ మతాల్లో ఉన్న అంశాలే కదా అని మీరు అనవచ్చు. నిజమే–, కానీ ఇస్లాంలో ఇలాంటి సమాజానికి పనికివచ్చే హితోక్తులు పరిపూర్ణంగా ఉన్నాయి అని నేనంటాను.**



పూర్వాశ్రమం గురించి చెప్పాలంటే – అగ్ర వర్ణాలవారు క్రింది వర్ణ జనులతో, దళితులతో కలిసి కూర్చోవడంగానీ, కలిసి భోంచేయడంగానీ ఈ ఆధునిక యుగంలో సైతం చేయరాదు. పైగా అలా చేసేవారిని అసహ్యించుకునేవారూ లేకపోలేదు. ఇస్లాం ప్రకారం అయితే మనిషిని గౌరవించడం, మర్యాదలు చేయడం ఎలాంటి తారతమ్యం పాటించకపోవడం తప్పనిసరి. ఇక్కడ వర్ణ భేదాలు లేవు. కుల పిచ్చీ లేదు. వంశ దాంభికాలూ లేవు. ఎవరూ పుట్టుక రీత్యా అల్పులు కాదు. మనిషి చేసుకున్న కర్మల్ని బట్టే అతని స్థానం ఏర్పడుతుంది. అందరూ ఒకే దేవుణ్ణి ఆరాధించేవారే, అందరూ దైవ దాసులే, దైవానికి చెందినవారే, సమానులే.

ఒక వ్యక్తి ఇస్లాం స్వీకరించిన మరుక్షణం అతనిలో విప్లవాత్మకమైన మార్పు వస్తుంది. అతనిపై రెండు బాధ్యతలు మోపబడతాయి. 1) బహుదైవారాధనను త్రోసిపుచ్చటం. 2) దేవుని ఏకత్వాన్ని స్వీకరించటం. జీవితపు అన్ని రంగాల్లో ఆయన ఆదేశాలను నిర్వర్తించటం. ఏకేశ్వరుడు చేయమన్న దానిని చేయాలి. వద్దన్న వాటిని విసర్జించాలి. అలా మనం చేసిన నాడు దైవానికి ప్రీతిపాత్రులై స్వర్గంలో మహా ప్రవక్త (స) వారి సాంగత్యాన్ని పొందే సౌభాగ్యాన్ని సొంతం చేసుకున్నవాళ్ళం అవుతాము. ఒక వర్గం స్వర్గానికి వెళితే, మరో వర్గం నరకానికెళుతుంది. ఎటు వెళ్ళాలో మీరే నిర్ణయించుకోండి. ఈ జీవితం మీది. దీన్ని సార్థకం చేసుకుంటారో, వృథా పర్చుకుంటారో మీ ఇష్టం. ధర్మంలో మాత్రం ఎలాంటి బలాత్కారం, బలవంతం లేదు.